


కేసీఆర్ లేఖపై డిప్యూటీ సీఎం భట్టి సీరియస్

# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd




కాట్నపల్లి ఘటనలో నిందితుడికి కఠినశిక్ష పడేలా చర్యలు

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 170 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- సోమవారం 17 జూన్ 2024

## నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలపై మోదీ స్పందించాలి..

### - కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కష్టపడి చదివే తమ పిల్లలు డాక్టర్ కావాలని కలలు కన్న తల్లిదండ్రుల ఆశలపై గందరగోళంగా మారిన నీట్ పరీక్షా వ్యవహారం నీళ్లు చల్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ విమర్శించారు. ఓవైపు బీహార్‌లో రూ.30 లక్షల చొప్పున నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారని, ఇప్పటికే పదుల సంఖ్యలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలొస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఆది నుంచి నీట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తోందని విమర్శించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ ఎగ్జామ్‌పై ఇన్ని ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ మోదీ సర్కార్ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రతిసారి విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని.. కీలకమైన నీట్ పరీక్షపై మాత్రం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు, లక్షలాదిమంది తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్‌లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావటం ఎన్నోరకాల అనుమానాలకు తావిస్తోందన్నారు. అందులోనూ ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే.. పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందని అన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. అలాంటిది.. ఇంత ఒకే సెంటర్‌లో ఇంతమంది విద్యార్థులకు పెద్దమొత్తంలో మార్కులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అలాగే ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించటం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు.. అసలు ఈ వ్యవహారం బయటకు రాగానే పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాల్సిన కేంద్రం ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని ఇప్పటిదాకా పట్టించుకోలేదని నిలదీశారు. పైగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అంతా సవ్యంగానే జరిగిందంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్ని ఫిర్యాదులు చేసిన కేంద్రం స్పందించలేదని, పలువురు ప్రముఖులు సుప్రీంకోర్టులో కేసు వేసినా ఒక్క వివరణ కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదని కేటీఆర్ అన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కూడా కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చాలా చిత్రమైన సమాధానాలు చెప్పిందన్నారు. ఈ ఏడాది 1563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్లు చెబుతోందని, అసలు నీట్ లాంటి

వివరాలు 2లో

## త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ : కేసీఆర్



**హైదరాబాద్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముస్లిం శుభాకాంక్షలు తెలిపారు. దైవాజ్ఞను అనుసరించి సమాజ హితంకోరి ప్రతీ మానవుడు నిస్వార్థ సేవలను అందించాలనే సందేశం బక్రీద్ మనకు అందిస్తుందని కేసీఆర్ తెలిపారు. తమకు కలిగిన దాంట్లోంచి ఎంతో కొంత ఇతరులకు పంచడమనే దాతృత్వ స్వభావాన్ని బక్రీద్ పండుగ ద్వారా నేర్చుకోవాలని అన్నారు.

## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్ ) పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం అస్సలామ్, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఈ పండుగ జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రవక్తల అచంచలమైన భక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని చాటిచెపుతోందని సీఎం అభిప్రాయపడ్డారు.

## నేడు బక్రీద్




**కరీంనగర్ కల్చరల్, జూన్ 16:** ముస్లింలు సోమవారం (ఈద్ ఉల్ జుహా) బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. నగరంలోని పురానీ, రేకుర్తి సాలెహ్‌నగర్ ఈద్గాలతో పాటు కొత్తపల్లి, చింతకుంట, బైపాస్ రోడ్ ఈద్గాల్లోలో సామూహిక ప్రార్థనలు జరుగనున్నాయి. నగరంలోని ప్రధాన మసీదులతో పాటు గ్రామాలు, మండల కేంద్రాలలోని మజీద్‌లలో, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ సందర్భంగా మార్కెట్‌లో, శివారు ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల అమ్మకాల సందడి నెలకొంది. పలు కూడళ్లలో గ్రామాల నుంచి విక్రయదారులు గొర్రెలు, మేకలు తీసుక వచ్చి అమ్ముతుండగా గిరాకీ పెరిగింది.

## శ్రీశైలం, సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించే ప్రసక్తే లేదు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన, చట్టబద్ధమైన వాటా దక్కాల్సిందేనని నొక్కిచెప్పిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి..బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో గట్టిగా వాదనలు వినిపించాలని న్యాయవాదులకు సూచించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాధన్‌తో ఆదివారం సమావేశమైన మంత్రి.. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు, సుప్రీంకోర్టులో ఉన్న పిటిషన్లపై ఆరా తీశారు. అవి ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో వైద్యనాథన్ వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీలో 2015లో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన పరస్పర అవగాహనా ఒప్పందం ఆ ఒక్క సంవత్సరానికి మాత్రమే పరిమితమని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా, ఎలాంటి ప్రాతిపదిక లేకుండా ఆనాడు ఏకపక్షంగా ఈ ఒప్పందం జరిగిందన్నారు. ప్రస్తుతం బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రెండు రాష్ట్రాలకు సంబంధించిన వివాదం విచారణ దశలో ఉన్నందున తుది తీర్పు వెలువడేండ వరకు కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో పంచుకునేలా తెలంగాణ వాదనలు ఉండాలన్నారు. పాత ఒప్పందాన్ని సవరించేలా పట్టుబట్టాలన్నారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల గురించి వైద్యానాథన్ ఈ సమావేశంలో వివరిస్తూ, న్యాయమైన వాటా దక్కేందుకు, వివాదాన్ని పరిష్కరించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్రలతో సంప్రదింపులు జరపాలని మంత్రికి సూచించారు. చర్చలు, సంప్రదింపుల ద్వారానే పరిష్కారం లభిస్తుందన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. దానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణలో కృష్ణా బేసిన్ విస్తీర్ణం గురించి వివరించిన మంత్రి ఉత్తమ్.. రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, దీర్ఘకాలంగా జరుగుతున్న అన్యాయం, న్యాయమైన వాటా కోసం చేయాల్సిన పోరాటం.. వీటన్నింటిపై వైద్యనాథన్ సహా లీగల్ టీమ్‌కు సూచనలు చేశారు. రాష్ట్రానికి చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా దక్కాల్సిన కృష్ణా జలాల వాటా విషయంలో అవసరమైన లీగల్ పోరాటానికి సిద్దంగా ఉండాలని న్యాయవాదులకు సూచించారు. డిపార్టుమెంట్ అధికారులు, ఇంజినీర్ల నుంచి అవసరమైన టెక్నికల్ సహకారం, వివరాలు అందుతాయాని భరోసా ఇచ్చారు. సుప్రీంకోర్టు, బ్రిజేశ్ ట్రిబ్యునల్ ముందు ఉన్న పిటిషన్ల విచారణ సందర్భంగా తెలంగాణకు దక్కాల్సిన హక్కుల విషయంలో రాజీ లేకుండా న్యాయమైన వాటా పొందేందుకు గట్టిగా వాదనలు వినిపించాలని సూచించారు. ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం ఉంటుందన్న విశ్వాసాన్ని కల్పించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు)కు అప్పగించే ప్రసక్తే లేదని ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సవరించే ప్రాసెస్ ఇప్పుడు మొదలైందని, ఏపీ లేవనెత్తే వాదనలను న్యాయస్థానాల వేదికగా వాదనల ద్వారా గట్టిగా తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఉన్నప్పుడూ తెలంగాణకు అన్యాయమే జరిగిందని, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కూడా పదేండ్ల బీఆర్ఎస్ పాలనలోనూ తగిన న్యాయం జరగలేదన్నారు. దక్షిణ తెలంగాణ ప్రాం తానికి కృష్ణా జలాలు ఏకైక ఆధారమని, ఇంతకాలం జరిగిన అన్యాయం ఇకపైన కంటిన్యూ కావ డానికి వీల్లేదని, న్యాయమైన హక్కులు సాధించుకోవాల్సిందేనని సమావేశం ద్వారా స్పష్టం చేశారు. రాష్ట్ర ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీర్-ఇన్-చీఫ్ నాగేందర్, రాష్ట్ర ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, లీగల్ టీమ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఐదురోజులు వానలు..

**● ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ**

**హైదరాబాద్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. అలాగే, ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఈ నెల 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది.



## జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రదాడులపై అమిత్ షా సమీక్ష

**శ్రీనగర్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడుల ఘటనల నేపథ్యంలో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ఆదివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత వారంరోజుల వ్యవధిలోనే నాలుగు దాడి ఘటనలు జరగడం, అమర్‌నాథ్ యాత్రకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో భద్రతా చర్యలపై అధికారులతో ఆయన దాదాపు ఐదుగంటల పాటు సమావేశమయ్యారు.



## నీట్ ఎగ్జామ్‌లో అవకతకవలపై మోదీ స్పందించాలి..

(మొదటి పేజీ తరువాయి)

ఎగ్జామ్‌లకు గ్రేస్ మార్కులు కలిపే విధానమే లేదని, అయినప్పటికీ ఎందుకిలా చేశారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 1563 మంది విద్యార్థులకే ఎందుకు గ్రేస్ మార్కులు ఇచ్చారో. దానికి ఏ ప్రాతిపదికను తీసుకున్నారో స్పష్టం చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. o4, -1 విధానం ఉండే ఈ ఎగ్జామ్‌లో సాధ్యం కాని విధంగా కొంతమంది విద్యార్థులకు 718, 719 మార్కులు రావటం కూడా మొత్తం గ్రేస్ మార్కుల విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ మొత్తం అంశం వివాదం కావటంతో ఇప్పుడు ఎన్టీఏ 1563 మందికి విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చామని వాటిని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిందన్నారు. గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థులకు వాటిని తొలగించి మళ్లీ ఎగ్జామ్ రాయిస్తామని లేదంటే గ్రేస్ మార్కులు లేకుండా ఉన్న ర్యాకింగ్‌నే జత చేస్తామని పూటకో మాట మాట్లాడుతోందని మండిపడ్డారు.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ను ప్రమాదంలోకి నెట్టి ఇప్పుడు వాస్తవాలు బయటకు రాకుండా నానాతంటాలు పడుతున్నారని మండిపడ్డారు.ఒక్క గ్రేస్ మార్కుల అంశమే కాకుండా నీట్ పేపరే లీకైందంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టంచేశారు. దీనికి బలం చేకూరే విధంగా గుజరాత్, బీహార్ లో పోలీసులు నీట్‌లో అవకతవకలు పాల్పడిన కొంతమందిని అరెస్ట్ చేశారని, వరుసగా బయటపడుతున్న వివాదస్పద వ్యవహారాల కారణంగా నీట్ ఎగ్జామ్ తీరుపై విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా అనుమానాలు బలపడుతున్నాయని అన్నారు.తెలుగు రాష్ట్రాల నుంచి కూడా నీట్ ఎగ్జామ్‌ను పెద్దసంఖ్యలో విద్యార్థులు రాశారని, నీట్ లో జరిగిన గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీ ఆరోపణల కారణంగా తెలంగాణ విద్యార్థులు కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు మన రాష్ట్ర ఎంపీలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించే విధంగా రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు ఎన్డీఏ సర్కారుపై ఒత్తిడి తేవాలని కోరారు. ఇంత జరుగుతున్నా ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాల్సిన అవసరముంది. లక్షలాది విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించిన ఈ అంశంలో వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, వెంటనే ప్రధాని దీనిపై స్పందించి మొత్తం అవకతవకలకు బాధ్యులెవరన్నది దేశ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.. నీట్ లో జరిగిన అవకతవకల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ఇబ్బంది లేకుండా, వారికి న్యాయం చేసే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇందులో ఎన్టీఏ పాత్ర పై అత్యున్నత దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీలకు పాల్పడిన వారితోపాటు.. అక్రమంగా లబ్దిపొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.అత్యంత ప్రతిష్టాత్మక నీట్ ఎగ్జామ్ మాత్రమే కాదు దేశంలోని ఎన్నో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఎన్టీఏ ఆధ్వర్యంలోనే జరుగుతున్నందున తాజాగా బయటపడ్డ వివాదస్పద అంశాల కారణంగా దానిపై విద్యార్థులు నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరముందన్నారు.. నీట్ లో అక్రమాల కారణంగా కష్టపడి చదివిన మన విద్యార్థులకు ఎలాంటి నష్టం జరిగినా అసలు ఊరుకునే ప్రసక్తే లేదని, వారి తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టంచేశారు.

## కేసీఆర్ లేఖపై డిప్యూటీ సీఎం భట్టి సీరియస్


**హైదరాబాద్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మాజీ సీఎం, గులాబీ కేసీఆర్ లేఖ కాక రేపుతోంది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణానికి సంబంధించిన ఎంక్వైరీ కమిషన్‌కు కేసీఆర్ ఇచ్చిన రిప్లై లేఖ హాట్ టాపిక్‌గా మారింది.కమిషన్ విచారణను కేసీఆర్ తప్పుబట్టడంపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఫైర్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే కేసీఆర్ లేఖపై తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. విచారణ కమిషన్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. కేసీఆర్ ఏ తప్పు చేయనట్లైతే కమిషన్ ముందు విచారణకు హాజరైతే వచ్చే నష్టమేంటని ప్రశ్నించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కోరడంతోనే గత ప్రభుత్వంలోని విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కూడా కమిషన్ ముందు హాజరయ్యారని గుర్తు చేశారు. అలాంటిది తప్పు చేయనప్పుడు కేసీఆర్ కమిషన్ ముందు దర్యాప్తుకు హాజరు కావడానికి వచ్చిన సమస్య ఏంటని నిలదీశారు.



# చత్తీస్గఢ్ డోర్నపాల్లో అరెస్టు చేసిన మూలవాసి బచావో మంచ్ కార్యకర్త కాదాటి కృష్ణకుమార్ను వెంటనే విడుదల చేయాలి

- బస్తర్ ఆదివాసీలపై ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకిద్దాం
- పౌర హక్కుల సంఘం (సిఎల్ సి) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

**కొత్తగూడెం, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**చత్తీస్గడ్ ఆదివాసీ ఉద్యమాలను అణచివేయడం కోసం బస్తర్ వ్యాప్తంగా 115 సాయుధ పోలీసు క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా 2021 మే నెలలో సిలింగేర్ ప్రాంతంలో రాత్రికి రాత్రే క్యాంపు ఏర్పాటు చేశారు. ఆదివాసీలు పేసా చట్టం, గ్రాను సభ తీర్మాణ అనుమతి లేకుండా క్యాంపు ఏర్పాటు చేయడానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడం జరిగింది. ఆ ఆందోళనపై 17 మేన జరిగిన పోలీసులు కాల్పులో నలుగురిని పోలీసులు హత్య చేశారు. ఇద్దరు పురుషులు కాగా, ఒకరు గర్భిణీ మహిళ. ఇప్పటి వరకు ఎఫ్.ఐ.ఆర్. నమోదు కాలేదు, విచారణ కొనసాగడం లేదు. మొదట్లో బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి కోటి రూపాయల నష్టపరిహారం డిమాండ్ చేయగా. 10 లక్షలు ప్రకటించిన ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఆదివాసీలు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఈ ఘటన నేపథ్యంలోనే ప్రతి ఏడాది జూన్ 9, 10 తేదీలలో సిలింగేర్ ఉద్యమ అమరుల సంస్మరణలు జరిపేవారు. ఆ విధంగా 2022, 2023లో కూడా జరిపారు. ఈ ఏడాది ఈ అమరుల సంస్మరణ సభ అనుమతి కోసం ప్రయత్నించిన ఆదివాసీల పై పోలీసు నిర్బంధం తీవ్రస్థాయిలో కొనసాగుతున్నది.సిలింగేర్ అమరుల తృతీయ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ అనుమతి కోసం సుక్మా వెళ్లి తిరిగి వస్తున్న మూలవాసి బచావో మంచ్ కార్యకర్త కృష్ణ కుమార్ కాదాటిని దోర్నపాల్ పోలీస్ స్టేషన్ ఇంచార్జి శశికాంత్ సిన్హా ప్రత్యక్ష చర్యలో అక్రమంగా అరెస్టు చేశారు. ఆయనపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టినారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్యగా భావిస్తూ ఇప్పటి వరకు అరెస్టు చేసిన మూలవాసి బచావో మంచ్



CIVIL LIBERTIES COMMITTEE (CLC) - TELANGANA

పౌరహక్కుల సంఘం – తెలంగాణ

Office : 8-43/8/U/17/E, Road No.3, Lane 8, Rajshekhara Colony, Balaji Hills, Uppal, Hyderabad - 500 039. Email : clctelangana2015@gmail.com

President :
**Prof. Laxman Gaddam**
Hyderabad
Cell: 9441181271

Vice President's
**Dr. Gunti Ravi**
Hyderabad
Cell: 9440009191

**K. Ravi**
Sattupalli
Cell: 9490300935

Geneal Secretary:
**N. Narayana Rao**
Hyderabad
Cell: 9866734867

Joint Secretaries:
**Madana. Kumaraswamy**
Godavari Khani
Peddapalli
Cell: 9849548275

**M. Thirumalaiah**
Shadnagar
Cell: 7675015616

**G. Jabali**
Advocate
Warangal
Cell: 9490441241

Treasurer:
**Algot Ravinder**
Nizamabad
Cell: 9440485525

తేది: 15.06.2024

**ప్రెస్‌నోట్**

చత్తీస్‌ఘడ్ డోర్నపాల్‌లో అరెస్టు చేసిన మూలవాసి బచావో మంచ్ కార్యకర్త కాదాటి కృష్ణకుమార్‌ను వెంటనే విడుదల చేయాలి.

బస్తర్‌లో ఆదివాసీలపై ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకిద్దాం

చత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీ ఉద్యమాలను అణచివేయడం కోసం బస్తర్ వ్యాప్తంగా 115 సాయుధ పోలీసు క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా 2021 మే నెలలో సిలింగేర్ ప్రాంతంలో రాత్రికి రాత్రే క్యాంపు ఏర్పాటు చేశారు. ఆదివాసీలు పేసా చట్టం, గ్రామ సభ తీర్మాణ అనుమతి లేకుండా క్యాంపు ఏర్పాటు చేయడానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడం జరిగింది. ఆ ఆందోళనపై 17 మేన జరిగిన పోలీసులు కాల్పులో నలుగురిని పోలీసులు హత్య చేశారు. ఇద్దరు పురుషులు కాగా, ఒకరు గర్భిణీ మహిళ. ఇప్పటి వరకు ఎఫ్.ఐ.ఆర్. నమోదు కాలేదు, విచారణ కొనసాగడం లేదు. మొదట్లో బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి కోటి రూపాయల నష్టపరిహారం డిమాండ్ చేయగా, 10 లక్షలు ప్రకటించిన ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఆదివాసీలు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఈ ఘటన నేపథ్యంలోనే ప్రతి ఏడాది జూన్ 9, 10 తేదీలలో సిలింగేర్ ఉద్యమ అమరుల సంస్మరణలు జరిపేవారు. ఆ విధంగా 2022, 2023లో కూడా జరిపారు. ఈ ఏడాది ఈ అమరుల సంస్మరణ సభ అనుమతి కోసం ప్రయత్నించిన ఆదివాసీల పై పోలీసు నిర్బంధం తీవ్రస్థాయిలో కొనసాగుతున్నది.

సిలింగేర్ అమరుల తృతీయ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ అనుమతి కోసం సుక్మా వెళ్లి తిరిగి వస్తున్న మూలవాసి బచావో మంచ్ కార్యకర్త కృష్ణ కుమార్ కాదాటిని దోర్నపాల్ పోలీస్ స్టేషన్ ఇంచార్జి శశికాంత్ సిన్హా ప్రత్యక్ష చర్యలో అక్రమంగా అరెస్టు చేశారు. ఆయనపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టినారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్యగా భావిస్తూ ఇప్పటి వరకు అరెస్టు చేసిన మూలవాసి బచావో మంచ్ కార్యకర్తలందరిని బేషరతుగా విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేస్తుంది. ఇప్పటి వరకు మనకు తెలిసిన మేరకే మూలవాసి బచావో మంచ్ అధ్యక్షురాలు సునీత పొట్టం, మడ్కం జోగా, మడ్కం జోషన్, గజేంద్ర మాండవి, సుర్జు టేకం, సునీతా పోతామి, సురేష్ ఆవలం లను అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెట్టి నిర్బంధించి ఉంచారు. ఆదివాసీలు వాళ్ళకోసం వాళ్ళే మూలవాసి బచావో మంచ్ అనే సంస్థను ఏర్పాటు చేసుకొని వాళ్ళ హక్కులకో వాళ్ళే పోరాడుతున్నారు. దాన్ని కూడా ప్రభుత్వాలు నేరంగా భావిస్తే ఇక ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడ అమలవుతున్నట్లు?

కార్యకర్తలందరిని బేషరతుగా విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేస్తుంది. ఇప్పటి వరకు మనకు తెలిసిన మేరకే మూలవాసి బచావో మంచ్ అధ్యక్షురాలు సునీత పొట్టం, మడ్కం జోగా, మడ్కం జోషన్. గజేంద్ర మాండవి, సుర్జు టేకం, సునీతా పోతామి, సురేష్ ఆవలం లను అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెట్టి నిర్బంధించి ఉంచారు. ఆదివాసీలు వాళ్ళకోసం వాళ్ళే మూలవాసి బచావో మంచ్ అనే సంస్థను ఏర్పాటు చేసుకొని వాళ్ళ హక్కులకో వాళ్ళే పోరాడుతున్నారు. దాన్ని కూడా ప్రభుత్వాలు నేరంగా భావిస్తే ఇక ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడ అమలవుతున్నట్టు? జూన్ 8న సిలింగేర్ మూడో వార్షికోత్సవానికి సంబంధించిన దరఖాస్తును సమర్పించేందుకు ఆదివాసులు సుక్మా కలెక్టర్కు బృందంగా ఏర్పడి పంపించినారు. అయితే జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్, దోర్నపాల్ పోలీస్ స్టేషన్ ఇంచార్జి శశికాంత్ సిన్హా, వీరి వైపు నుంచి వచ్చిన దరఖాస్తును పక్కనబెట్టి మూలవాసి బచావో మంచ్ కార్యకర్తలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారు. ఈ చర్యతో కార్యకర్తల్లో భయాందోళన వాతావరణం నెలకొల్పడం, సభను కొనసాగించకుండా చేయడం అనే వారి అసలు లక్ష్యం నెరవేరేందుకు పోలీసు అధికారులు అకస్మాత్తుగా వాహనాల్లో దోర్నపాల్కు వచ్చి వారి సంస్థకు చెందిన ముగ్గురు సహచరులను అరెస్టు చేసి బెదిరించి పోలీస్ స్టేషన్కు తరలించారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయని ఒప్పుకోవాలని ముగ్గురిపై ఒత్తిడి తెచ్చారు. కృష్ణ కుమార్ కదాటిని పోలీసులు 2 రోజుల పాటు తీవ్రంగా కొట్టారు. అతను అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు, పోలీసులు అతన్ని ఆసుపత్రిలో చేర్చవలసి వచ్చింది. పోలీసులు మా ఇద్దరు కార్యకర్తలను విడుదల చేశారు, కృష్ణ కుమార్ కదాటిని మావోయిస్టు సానుభూతిపరుడిగా అని తప్పుడు ఆరోపణలు చేసి అతనిపై చర్యలు చేపట్టడానికి ప్రయత్నం చేశారు.బస్తర్ లో బీజేపీ పాలనలో కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రోత్సహించడం, ఆదివాసీలను చంపడం ప్రభుత్వ కర్తవ్యంగా కనిపిస్తోంది. ఇది చాలా ఆందోళనకరమైనది మరియు సున్నితమైనది. గత 5-6 నెలల పరిస్థితులను చూస్తే ప్రభుత్వం పూర్తి కార్పొరేట్ అనుకూలమని ఋజువైంది. ఈ నేపథ్యంలో బస్తర్లో జరుగుతున్న ప్రజా పోరాటాలలో ముఖ్య భూమిక పోషిస్తున్న మూల్వాసి బచావో మంచ్ కార్యకర్తలను నిరంతరం అరెస్టులు, నిర్బంధాలకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం ఈ నిర్బంధ చర్యలకు అనుకూలత కల్పించి ఇంకా వారిని భయపెట్టాలని చూస్తున్నది.అరెస్టు చేసిన మూలవాసి బచావో మంచ్ కార్యకర్తలందరిని వెంటనే విడుదల చేయాలని పౌరహక్కుల సంఘంతో పాటు మిగతా హక్కుల సంఘాలు ప్రజా స్వామిక వాదులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నామని ప్రొ. జి. లక్ష్మన్, రాష్ట్ర అధ్యక్షుడు,పౌరహక్కుల సంఘం, నారాయణరావు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పౌరహక్కుల సంఘం నాయకులు సంయుక్తంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# భూమిలేని పేదలకు భూమి పంచాలి

- విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్

**హైదరాబాద్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**భూమిలేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి పంచాలని విసికె తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జా తారకం) ఆధ్వర్యంలో ఆ పార్టీ కో ఆర్డినేటర్ జన్ను సాంబయ్య అధ్యక్షతన భూమిని పంచు, బడ్జెట్ పెంచు అనే అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో అనేక దశాబ్దాలుగా భూమి కోసం పోరాటాలు జరిగాయని, భూ సంస్కరణ చట్టాలు రావడంతో మిగులు భూములు ఏర్పడ్డాయని అన్నారు. తెలంగాణలో నాలుగు లక్షల రకరాల మిగులు భూములు వున్నాయని, వాటిని గత కెసిఆర్ ప్రభుత్వం వేలం వేసి అమ్ముకుందని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజలు కెసిఆర్ ను ఓడించి రేవంత్ రెడ్డికి అధికారాన్ని అప్పగించారని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ప్రభుత్వ భూములను వేలం వేస్తుందని ఆయన విమర్శించారు. పట్టణ, గ్రామీణ గరిష్ఠ భూపరిమితి చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన



డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు రెండువందల యాభై గజాల భూమిని ఇస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికలలో హామీ ఇచ్చాడని, వెంటనే ఆ హామీని అమలు చేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ భూమి, ఉపాధి, ఉద్యోగాలు రావాలంటే అధికారం పేద వర్గాలకు రావాలని అన్నారు. బిసి కులగణన చేసి స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో 90 శాతంగా ఉన్న బహుజన వర్గాలు ఐక్యంగా రాజ్యాధికారం చేపట్టాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షత వహించిన ఆర్ పి ఐ (బొజ్జా తారకం) జన్ను సాంబయ్య మాట్లాడుతూ భూమి వుంటేనే ఆర్థిక అసమానతలు తొలిగిపోతాయని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోనేరు రంగారావు సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని అంకేశ్వరపు రమేష్ సమన్వయం చేయగా విసికె అధికార ప్రతినిధి తెలంగాణ శ్యామ్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ నాయకులు చాపర్తి కుమార్ గాడ్గే, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ సీనియర్ నాయకులు శ్రీరాముల పైడి, దాసరి రాజు, పీసరి రజిత, కనుకుల శారద, ఎండి షాహిదా, బుర్రి సాంబలక్ష్మి, తరాల సమ్మక్క, తరాల విజయ, మానాల మరియ, పార్నంది రమేష్ చంద్ర, గునిగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఆర్ పి ఐ (బొజ్జా తారకం) రాష్ట్ర కమిటీ ఎన్నికరాష్ట్ర అధ్యక్షునిగా జన్ను సాంబయ్య రాష్ట్ర సదస్సు అనంతరం కమిటీ నాయకులు రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఆర్ పి ఐ (బొజ్జా తారకం) రాష్ట్ర అధ్యక్షులుగా జన్ను సాంబయ్య, ప్రధానకార్యదర్శిగా అంకేశ్వరపు రమేష్, ఉపాధ్యక్షురాలుగా పీసరి రజిత, రాష్ట్ర కార్యదర్శిగా పార్నంది రమేష్ చంద్ర లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కాట్నపల్లి ఘటనలో నిందితుడికి కఠినశిక్ష పడేలా చర్యలు

**పెద్దపల్లిటౌన్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** సుల్తానాబాద్ మండలం కాట్న పల్లి రైస్‌మిల్‌లో జరిగిన సంఘ టన అమానుషమని, నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్‌బాబు, రాష్ట్ర పంచా యతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు.ఆదివారం సుల్తానాబాద్ మండ లం కాట్నపల్లి గ్రామంలోని రైసు మిల్లు వద్ద ఈనెల 13న ఆరేళ్ళ చిన్నారిపై జరిగిన ఘటన ప్రదే శాన్ని మంత్రులు దుదిళ్ళ శ్రీధర్ బాబు, సీతక్క పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, చింతకుంట విజ యరమణారావులతో కలిసి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. అనంతరం పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో వారు మాట్లాడారు. తల్లిదండ్రుల మధ్య నిద్రపోతున్న చిన్నారిని ఎత్తుకెళ్లి రైస్ మిల్లులో పని చేసే బీహార్‌కు చెందిన వ్యక్తి అత్యాచారం చేసి హత్య చేశాడని మంత్రులు ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ సంఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం, ఎంపీ, సహచర ఎమ్మెల్యేలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని తెలిపారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖ మరింత భద్రత కల్పన, నిఘా పెంపు, డ్రగ్స్ మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి దురలవాట్లకు గురైన వారిని గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. నేరం చేసిన వ్యక్తులకు వెంటనే శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు ఇటు వంటి దారుణాలకు పాల్పడుతున్నారన్నారు.డ్రగ్స్, గంజాయిని ఉక్కు పాదంతో అణచి వేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని, వ్యక్తి ఆరోగ్యంతో పాటు సమాజానికి సైతం డ్రగ్స్, గంజాయి నష్టం చేస్తున్నాయని వివరించారు. ప్రతి ఇంటిలో పని చేసే డొమెస్టిక్ హెల్పర్, ప్రతి పరిశ్రమలో పనిచేసే వర్కర్ల బ్యాక్ గ్రౌండ్‌చెక్ చేసిన తర్వాతే వారికి ఉపాధి కల్పించాలని సూచిం చారు. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం ఎవరూ తీర్చలేరని, ఆ కుటుం బానికి అండగా నిలిచేందుకు చిన్నారి తండ్రికి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌తో చర్చించి ఉద్యోగం కల్పించనున్నట్లు, వారికి ఇంటి నిర్మా ణానికి స్థలంతో పాటు ఇల్లు మంజూరు, ఆ తల్లిదండ్రుల వద్ద ఉన్న మరో చిన్నారి చదువు బాధ్యతలను సైతం ప్రభుత్వం తీసుకుంటుం దని వారు స్పష్టం చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావు మాట్లాడుతూ సుల్తానాబాద్‌లో జరిగిన చిన్నారి సంఘటన పట్ల యావత్ రాష్ట్రం దిగ్భ్రాంతికి గురిచేసి ందని, సభ్య సమాజం తలదించుకునే విధంగా ఆ ఘటన జరగడం దురదృష్టకర మన్నారు.బాధిత కుటుంబానికి సంబంధిత రైస్‌మిల్ నుంచి ఐదు న్నర లక్షల రూపాయల పరిహారం, అదేవిధంగా మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రిని కలిసి చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున మరో రెండున్నర లక్షల పరిహారం అందిం చాలని నిర్ణయిం చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు 200లకు పైగా రైస్ మిల్లులు ఉంటాయని, చాలా కాలంగా సీజన్ సమయంలో ఒరిస్సా, బీహార్, మధ్యప్రదేశ్ నుంచి కార్మికులు ధాన్యం కొనుగోలు సమ యాల్లో వచ్చి పని చేస్తారని, ఎప్పుడు ఇలాంటి సంఘటనలు జరగ లేదని, దీని పట్ల చాలా బాధప డుతున్నామని అన్నారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట కలెక్టర్ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ ఎం.చేత న, ఏసీపీలు గజ్జి క్రిష్ణ, రమేష్, సీఐ క్రిష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారు లు తదితరులు పాల్గొన్నారు.



# భద్రకాళి దేవాలయాన్ని సందర్శించిన కలెక్టర్ సత్య శారదదేవి



**వరంగల్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని వరంగల్ నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని సత్యశారద దేవి కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన సత్యశారద దేవికి ఆలయ ఈఓ శేషుభారతి, ఆలయ ప్రధాన్చాకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభం, వేదస్వస్తి, మంగళవాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం కలెక్టర్ సత్యశారద దేవికి ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, వేదపండితులు ప్రదీప్ కుమార్ శర్మ, ముఖ్య అర్చకులు చెప్పెల వెంకట నాగరాజ శర్మ, యెల్లంభట్ల రమేష్ శర్మలు మహదాశీర్వచనం జరిపి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన చెరుకు రాంచందర్

- తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్



**హనుమకొండ ప్రతినిధి, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ను, తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం పాదయాత్ర చేపట్టి, కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో కీలక భూమిక వహించిన పోరాట యోధుడు భట్టి విక్రమార్క అని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ రామ్ చందర్ అన్నారు. ఆయన వెంట మాల సంఘాల జేఏసీ నాయకులు, పార్టీ శ్రేణులు, నాయకులు ఉన్నారు.

# చక్రిక వెల్‌నెస్ సెంటర్ సముదాయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**గంగాధర, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల కేంద్రంలోని నల్లాల రాజేందర్ ఏర్పాటు చేసుకున్న చక్రిక వెల్‌నెస్ సెంటర్ సముదాయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం

# హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.ప్రావీణ్య



**హనుమకొండ ప్రతినిధి, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కలెక్టర్ సిక్తా పట్నాయక్ నారాయణపేట జిల్లా కలెక్టర్ గా బదిలీ పై వెళ్ళగా ఆ స్థానంలో పి.ప్రావిణ్య ఐ.ఏ.ఎస్ హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 3.గంటలకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సముదాయ భవనానికి చేరుకోగా, జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా (లోకల్ బాడీస్) , వెంకట్ రెడ్డి (రెవెన్యూ) , డి.ఆర్.ఓ. వై.వి గణేష్ పుష్పగిచ్చాలతో స్వాగతం పలికారు.

# 21న శ్రీ ధర్మవ్యాధ జన్మదిన రథోత్సవ ధ్వజారోహణ వేడుకలు

- రథోత్సవ ధ్వజారోహణ జెండా పండుగ ప్రతి ఇంట్లో ఘనంగా జరుపుకోవాలి
- హనుమకొండ జిల్లా ఆరెకటికలు




**హనుమకొండ ప్రతినిధి, జూన్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఆరెకటిక కులస్తుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం వేయి స్తంభాల గుడి ఆవరణలో జరిగింది. ఈ సమావేశానికి ఆరెకటిక కులస్తుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ మిరియాలకర్ దేవేందర్, జిల్లా అధ్యక్షులు రావుల కర్ సురేష్, కార్యవర్గ సభ్యులు రావులకర్ వెంకటేష్, ముఖ్య అతిథులుగా తెలంగాణ పిఆర్టియు జిల్లా అధ్యక్షులు రాజేశ్వరయ్య చారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూదరి రమేష్ గౌడ్, కార్యదర్శి దయానంద్, కోశాధికారి రావులకర్ శివకుమార్, కార్యవర్గ సభ్యులు, కుల బాంధవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకటిక సంఘం నేతలు మిరియాల కర్ దేవేందర్, రావులకార్ సురేష్, రావులకర్ వెంకటేష్ మాట్లాడారు. 21/07/2024 ఆదివారం రోజు జరుగు గురుపౌర్ణమి రోజున శ్రీ ధర్మవ్యాద జన్మదిన రథ మహోత్సవము ఊరేగింపు జరుపుకొనుటకు ప్రతి ఇంటి ముందు ధ్వజారోహణము జెండా పండుగ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమములో ప్రతి ఆరేకటిక ముద్దు బిడ్డ కుటుంబములు విధిగా పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు. అరె కటిక సంఘం వారి హక్కుల కోసం భవిష్యత్తు కోసం అందరి సహకారాలతో న భూతో న భవిషత్ విధంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆరెకటిక కులస్తుల సంఘం నేతలు, మహిళా కార్యదర్శులు, నాయకులు, కుల బాంధవులు, కుటుంబ సభ్యులు, వివిధ కుల బాంధవుల నేతలు పాల్గొన్నారు.

# దేశంలో కమ్యూనిస్టులు బలపడితేనే ప్రజలకు సమన్యాయం

- విజయవంతంగా ముగిసిన సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు




**హనుమకొండ ప్రతినిధి, జూన్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** దేశంలో కమ్యూనిస్టులు బలపడితేనే ప్రజలకు సమ న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా ధర్మ సాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్ లో రెండు రోజుల పాటు కొనసాగిన సీపీఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. నాడు యూపిఎ హయాంలో వామపక్షాల మద్దతు ఉండడం వల్లనే నాడు ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం తీసికొని వచ్చారని అన్నారు. దేశంలో గడిచిన పదేళ్ల పాలనలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏ ఒక్కటీ కూడా ప్రజలకు ఉపయోగ పడే సంక్షేమ కార్యక్రమం చేపట్టలేదని అన్నారు. దేశ ప్రజల సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడి దారులకు, బడా కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేశారని అన్నారు. మతం, కులం పేరుతో ప్రజలను విడదీసి రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నం చేసిందని, రాముని పేరుతో రాజకీయాలు నెరిపిందని అన్నారు. అయినప్పటికీ దేశ ప్రజలు గత లోక్ సభ ఎన్నికలలో మోడీ మత రాజకీయాలను తిరస్కరించి గుణపాఠం చెప్పారని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు బీజేపీ మత రాజకీయాలకు దూరంగా ఉండి ప్రజల కోసం పోరాటం చేసే కమ్యూనిస్టులను ఆదరించాలని కోరారు. శిక్షణా తరగతుల ద్వారా పొందిన చైతన్యంతో సీపీఐ కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ ముగింపు కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అద్యక్షత వహించగా శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్ గా ఆదరి శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు మండ సదాలక్ష్మి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, ధర్మల రామ్మూర్తి, బట్టు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రాజకీయ శిక్షణా తరగతులు

రెండు రోజుల పాటు జరిగిన సీపీఐ జిల్లా శిక్షణా తరగతులు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసాయి. రెండవ రోజు శిక్షణా తరగతులలో భారత రాజ్యాంగం– లౌకిక వాద పరిరక్షణ పై రిటైర్డ్ ప్రొఫెసర్ మార్క శంకర్ నారాయణ బోధించగా, కులం, మతం – మతోన్మాదంపై ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసఫ్ బోధించారు.

# తొర్రూర్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ ఎన్నిక





**తొర్రూర్ ప్రతినిధి, జూన్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని టి సి పిడి ఎ డిస్ట్రిబ్యూషన్ ఎన్నికలు ఆదివారం రోజు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు దొడ్డ రఘు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షుడు తోట సంతోష్ కాగా ప్రధాన కార్యదర్శిగా హనుమాన్ల మధుసూదన్ రెడ్డి ఎంపికయ్యారు. కోశాధికారిగా అన్నం వెంకట్ అలాగే తాడికొండ విజయ్ బాబు, తాటికొండ సతీష్ కర్నే, అనిల్, వెంపటి రమేష్, రంగన్న, వంశీ శంకర్ మూర్తి సమక్షంలో వీరందరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ప్రసంగిస్తూ నన్ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి బాధ్యత గల అధ్యక్ష పదవిని సక్రమంగా నిర్వహిస్తానని ఎవరికి ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరించే విధంగా చూస్తానని అన్నారు. అందరూ కలిసికట్టుగా కల్విడిగా పని చేసినప్పుడే అన్ని రంగాలలో విజయం సాధించవచ్చు అని పేర్కొన్నారు.

# కిక్ బాక్సింగ్ కోచింగ్‌లో ఉత్తీర్ణులైన వారికి జ్ఞాపికను అందజేసిన ఎమ్మెల్యే





**హసన్‌పర్తి, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వేసవికాలం సందర్భంగా గత కొద్దిరోజుల నుండి కిక్ బాక్సింగ్ కోచ్ పార్థసారధి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కిక్ బాక్సింగ్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కోచింగ్ లో ఉత్తీర్ణులైన వారికి జ్ఞాపికను అందజేసిన వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాక్సింగ్ అనేది ఒక పోరాట క్రీడ మరియు ఒక యుద్ధ కళ అని దీనిలో ఇద్దరు వ్యక్తులు సాధారణంగా రక్షణ చేతి తొడుగులు మరియు హ్యాండ్ ర్యాప్ లు మరియు మౌత్‌గార్డ్ లు వంటి ఇతర రక్షణ పరికరాలను ధరించి ఒకరిపై ఒకరు పంచ్‌లు విసురుకుంటారు. విద్యార్థి విద్యార్థినీలు వేసవి కాలంలో జల్సాలకు తిరగటం కాకుండా ఈ ఉచిత బాక్సింగ్ కోచింగ్ ఉపయోగించుకొని ఉత్తీర్ణులైన వారికి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేసి రాష్ట్ర మరియు జాతీయ అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలో పాల్గొనేలా కష్టపడాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, ఎంపీపీ కేతపాక సునీత, మాజీ సర్పంచ్ జోరిక పూలమ్మ, మాజీ జెడ్పిటిసి సారంగపాణి, ఎస్సీ సెల్ నాయకులు గొర్రె కిరణ్, శశికుమార్ మరియు హసన్పర్తి మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, బాక్సింగ్ కోచ్ పార్థసారథి తో పాటు తదితరులు పాల్గొన్నారు.




# యుపిఎస్సి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు సజావుగా జరిగాయి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



**హనుమకొండ ప్రతినిధి, జూన్ 16 (పిసీడబ్ల్యూ న్యూస్):** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న సివిల్స్ ప్రిలిమనరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించామని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. ఆదివారం యుపిఎస్సి సెంట్రల్ అబ్జర్వర్ హరిహర్ రాథ్, టీ.ఏస్ ఎన్పీడీసీఎల్ సి.ఎండి వరుణ్ రెడ్డి స్టేట్ స్పెషల్ అబ్జర్వర్ తో కలిసి ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తున్న యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, శ్రీ గాయత్రి డిగ్రీ కాలేజీ, పీజీ కాలేజీ , సి డి సి డీమ్డ్ యూనివర్సిటీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ , పింగిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల వడ్డేపల్లి , తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కాలేజ్ , న్యూ సైన్స్ డిగ్రీ , పీజీ కళాశాల , ఏస్.ఆర్ నేషనల్ హై స్కూల్ , మాస్టర్ జి డిగ్రీ , పీజీ కళాశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల అధికారులతో మాట్లాడుతూ.. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిర్వహించాలని అన్నారు. అభ్యర్థులకు కల్పించిన వసతులపై అధికారులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరీక్షకు మొత్తం 4730 మంది అభ్యర్థులకు గాను ఉదయం 2637 అంటే 55.75 %, మధ్యాహ్నం 2614 అంటే 55.26 % మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలో యుపిఎస్సి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగినట్లు తెలిపారు.

# ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన దివాకర టిఎస్

**ములుగు జిల్లా, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా కేంద్ర లో ని కలెక్టర్ ఛాంబర్ లో నూతన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు జిల్లా అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో దివాకర్ టిఎస్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి , ఆర్డీవో సత్యపాల్ రెడ్డి కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోయ శ్రీ హర్ష







**పెద్దపల్లి జిల్లా, జూన్ 16(పీసీడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లా నూతన కలెక్టర్ గా కోయ శ్రీ హర్ష ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా నారాయణపేట జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గా బదిలీ అయిన సందర్భంగా ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ను ఆర్డీఓ బి.గంగయ్య, కలెక్టరేట్ ఏ.ఓ. శ్రీనివాస్, పెద్దపల్లి తహసిల్దార్, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల పర్యవేక్షకులు, సిబ్బంది, జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

## మరమత్తులకు నోచుకోని మిషన్ భగీరథ పైపు లైన్

● పిసిడబ్ల్యూ కథనానికి స్పందన...


PCW తెలుగు దినపత్రిక

మరమత్తులకు నోచుకోని మిషన్ భగీరథ పైపు లైన్

● స్థానికులు పలు మార్లు పిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

బయ్యారం,జూన్ 13(పిసి డబ్ల్యు న్యూస్): మండల కేంద్రంలో గత నెల రోజులుగా మిషన్ భగీరథ మెయిన్ పైపులు లీక్ కావడంతో నీరు వృధాగా రోడ్లపై ప్రవహిస్తుంది. మండల కేంద్రంలోని పశువుల దవాఖాన ప్రక్కన,జడ్ పి ఎస్ ఎస్ బాలుర పాఠశాల ఎదురుగా,జూనియర్ కళాశాల ఎదురుగా,నల్లాల బావి ప్రక్కన పలు ప్రాంతాలలో మంచినీరు వృధా కావడంతో నీరు కలుషితం అవుతుందని గ్రామప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు.కలుషితమైన మురికి నీరు త్రాగటం వలన ఈ వర్షాకాలంలో రోగాలు వ్యాపించే ప్రమాధం ఉందని గ్రామప్రజలు వాపోతున్నారు. మిషన్ భగీరథ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా వెంటనే పైపు లైన్ మరమత్తులు చేయించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

epaper.pcwnews.in - Date: 14 Jun 2024 - Page 5
PCW News Broadcasting Pvt Ltd



**బయ్యారం,జూన్ 16(పిసి డబ్ల్యు న్యూస్):** మండల కేంద్రంలో గత నెల రోజులుగా మిషన్ భగీరథ మెయిన్ పైపులు లీక్ కావడంతో నీరు వృధాగా రోడ్ల పై ప్రవహిస్తుంది.మండల కేంద్రంలోని పశువుల దవాఖాన ప్రక్కన,జడ్ పి ఎస్ ఎస్ బాలుర పాఠశాల ఎదురుగా,జూనియర్ కళాశాల ఎదురుగా, నల్లాల బావి ప్రక్కన పలు ప్రాంతాలలో మంచినీరు వృధా కావడంతో నీరు కలుషితం అవుతుందని గ్రామప్రజలు అందోళన నేపథ్యంలో ఈనెల 14వ తేదీన పి సి డబ్ల్యూ పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి పైప్లైన్ మరమ్మత్తులు నిర్వహించారు. ప్రజా సమస్య లను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి, పాలకుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి పి సి డబ్ల్యూ ముందుగా ఉంటుందని ప్రజలు, అధికారులు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.



## రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో దాతల సహాయంతో ఉచితంగా కృత్రిమ పాదాలు పంపిణీ



**ఖమ్మం, జూన్ 17 (పిసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం నగరంలో గట్టయ్య సెంటర్ రోటరీ క్లబ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ నందు 105 మంది దివ్యాంగులకు ఏకం యూఎస్ఏ సంస్థ వారి ఆర్థిక సహాయంతో ఉచితంగా కృత్రిమ పాదాలను పంపిణీ చేయడం జరిగింది . ముఖ్య అతిథులుగా వికాస్ తరంగణి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పోలా శ్రీనివాస్ మరియు ఆర్యవైశ్య సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు గోళ్ళ రాధాకృష్ణ లు పాల్గొన్నారు . ఈ సందర్భంగా వారు రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం చైర్మన్ మల్లాది వాసుదేవ్ , సెక్రెటరీ సాంబశివరావు , క్లబ్ అధ్యక్షులు ఎన్.రవీంద్రనాథ్ , సర్వీస్ కో - ఆర్డినేటర్ పసుమర్తి రంగారావు , అసిస్టెంట్ గవర్నర్ పి.భూషన్ రావు , క్లబ్ సెక్రెటరీ హరి శ్రీనివాస్ , సభ్యులు మేకల బిక్షమయ్య , సుధాకర్ , రామకృష్ణ తదితరులను అభినందించి కొనియాడారు . ఈ సంస్థ ద్వారా ఎంతో మందికి ఉచితంగా కృత్రిమ పాదాలను అందించడం చాలా సంతోషంగా ఉందని , ముందు ముందు ఈ సంస్థ ద్వారా ఇంకెంతో మందికి సేవలు అందించాలని ఆకాంక్షించారు .

## దేశంలో కమ్యూనిస్టు పార్టీ బలపడితేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది

● భూపాలపల్లి జిల్లా సిపిఐ కార్యదర్శి రాజ్ కుమార్






**టేకుమట్ల, 16(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో కమ్యూనిస్టు పార్టీ బలపడితేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని భూపాలపల్లి జిల్లా సిపిఐ కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జరిగే శిక్షణ తరగతుల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీనీ ప్రజల్లోకి తీసుకెళ్తే దేశంలో కమ్యూనిస్టు పార్టీ అధికారం వస్తే ప్రజలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన గతంలో కంటే ఈసారి తక్కువ సీట్లు వచ్చాయన్నారు బిజెపి ప్రభుత్వంపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయారన్నారు. అందుకే బిజెపికి ప్రజా ఆదరణ తగ్గి తక్కువ సీట్లు గెలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ రెండు లక్షలు వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ ఇచ్చినట్టే ఇచ్చి అందరికీ ఇవ్వలేదన్నారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ పూర్తిగా రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలని, వానకాల సీజన్ కు రైతు భరోసా కింద రైతులకు ఖాతాల్లో డబ్బులు జామ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా సిపిఐ కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తో పాటు సిపిఐ జిల్లా సమితి సభ్యులు సోత్కు ప్రవీణ్, మండల కార్యదర్శి నబి, ఏఐటియు సి జిల్లా సహాయక కార్యదర్శి రేణికుంట్ల ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే లక్ష్మణ్, సిపిఐ నాయకులు పల్లె సమ్మయ్య, రామచంద్రు, పుష్ప, భాస్కర్, ఈర్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా విన్నపాలు

**ఖమ్మం, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం గ్రామంలో సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధరణి ని వెంటనే మార్చాలని అందుకు అడ్డు పడుతున్న సీసీల్యే నవీన్ మిట్టల్ ను మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విన్నపాలు పోస్ట్ కార్డు ద్వారా పంపారు . ఈ సందర్భంగా సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో అనేక అవకతవకలు చేసి ధరణి విశయం లో అనేక విధాలుగా ప్రజలను ఇబ్బంది పెట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి , సీసీల్యే గా పనిచేస్తున్న నవీన్ మిట్టల్ ఇంకా అదే పదవి లో కొనసాగడం తద్వారా ధరణి లో మార్పులు రావడం లో అతడే అడ్డంకులు సృష్టి స్తున్నా అతనిని నూతన ప్రభుత్వం మార్చకుండా ఉండటం వలన రైతు లు ఇబ్బంది పడుతున్నారని , అందుకే నవీన్ మిట్టల్ ను మార్చాలని ధరణి బాధితులు కోరుతున్నారని ఆయన తెలిపారు . ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెర్చి వెంటనే సీసీల్యే నవీన్ మిట్టల్ ను మార్చాలని కోరుతున్నారని ఆయన అన్నారు . ఈ పోస్ట్ కార్డు ల కార్యక్రమం లో సామజిక ఉద్యమ కారులు షేక్ అబ్దుల్ రహిమాన్ , పెళ్లూరి విజయ్ కుమార్ , బాణోత్ బద్రునాయక్ , అడ్వకేట్ షేక్ నజమా , డాక్టర్ ఖిజరుల్లా బి ఉపేంద్ర భాయ్ , దామల్ల జయ , గన్నోజు గోవిందమ్మ , దేవుళ్ళ నాగేశ్వర్ , ఖైసర్ రైతులు తదితరులు పాల్గొన్నారు .




## పవర్ లూమ్స్ పరిశ్రమలకు పనులు కల్పించాలి

● తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ డిమాండ్





**గంగాధర, జూన్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఘర్షకుర్తి లో జియో ట్యాగ్ విధానంతో నిమిత్తం లేకుండా పవర్ లూమ్స్ పరిశ్రమల్లో పని చేసే ప్రతి చేనేత పవర్ లూమ్స్ కార్మికులకు ప్రభుత్వం చేతినిండా పని కల్పించాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చిందం, అంకారపు సునీత డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్య వేదిక మహిళా విభాగం అధ్యక్షురాలు చిందం సునీత అధ్యక్షతన గర్శకుర్తి వస్త్రోత్పత్తి వ్యాపారులు, కార్మిక, పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నేతన్న వెతలు.. చర్చా గోష్టిపై సమావేశంలో జరిగిగింది. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చిందం, అంకారపు సునీత మాట్లాడుతూ గత ఎనిమిది మాసాలుగా పవర్ లూమ్స్ పై వస్త్రోత్పత్తులు నిలిచిపోయి పవర్ లూమ్స్ యజమానులు, ఆసాములు, కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనులు లేక అవస్థ పడుతున్న పవర్ లూమ్స్ కార్మికులకు, పరిశ్రమలకు ప్రభుత్వం పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జియో ట్యాగ్ విధానాన్ని రద్దు చేసి ప్రతీ పవర్ లూమ్స్ కి ప్రభుత్వం వస్త్రోత్పత్తులు అందించి పనులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమ, పవర్ లూమ్స్ పై విజిలెన్స్ దాడులు జరుగకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పనులు లేక అవస్థ పడుతున్న నేత కార్మికులకు పనులు కల్పించే విధంగా చర్యలు చేపడతామని వారు భరోస కల్పించారు. చేనేత పవర్ లూమ్స్ పరిశ్రమల బాగోగులు తెలుసుకోవడానికి రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తెలంగాణ చేనేత ఐక్యవేదిక పక్షాన తామ పర్యటిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పవర్ లూమ్స్ కార్మికుల ఇబ్బందులు, సమస్యలను ఒక నివేదికగా తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. త్రిఫ్ట్ పథకం ప్రభుత్వం ఎనిమిది నెలలుగా డబ్బు జమ చేయక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, ఈ పథకాన్ని ప్రభుత్వం యధావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పవర్ లూమ్స్ వస్త్ర పరిశ్రమలపై ఆధారపడ్డ చేనేత కార్మికులకు నేతన్న భరోసా పథకం కింద పనులు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేనేత ఐక్యవేదిక నాయకులకు హామీని ఇచ్చారని, ఆ హామీని అమలు చేసే వరకు ప్రభుత్వం వెంటపడి పథకం అమలు చేసేలా చేస్తామని అన్నారు. ప్రతి జిల్లాలో పవర్ లూమ్స్, చేనేత వస్త్ర ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, టెస్కో షోరూమ్స్ ఏర్పాటు చేసి ఉత్పత్తులను అమ్మాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టెస్కో షోరూం ఏర్పాటు చేస్తే తయారైన గుడ్డ ఉత్పత్తులు అమ్మకాలు జరిగితే చేనేత పవర్ లూమ్స్ కార్మికులు, ఆసాములు, యజమానుల పరిస్థితి మెరుగుపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర, జిల్లాల నాయకులు సదానందం, శ్రీనివాస్, రాపోలు వెంకటేశ్వర్లు, శ్రీగాద మైసయ్య, మోర ఆశన్న, వావిలాల శ్రీనివాస్, జడల చిరంజీవి, భాస్కర్, నారాయణ, లక్ష్మీనారాయణ, సురేష్, నాగన్న, కోటేశ్వరరావు, శారద, రమాదేవి, పద్మ, నీరజ, గంగాధర మండల పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి చిందం రాజమౌళి, వస్త్రోత్పత్తి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు అల్వాల విఠోభ, ప్రధాన కార్యదర్శి అన్నల్ దాస్ శ్రీనివాస్, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు అన్నల్దాస్ లక్ష్మీరాజం, ప్రధాన కార్యదర్శి అల్వాల రాజేశం, పద్మశాలి సేవా సంఘం ఉపాధ్యక్షులు గుండా రాజేశం, చిందం సత్యనారాయణ, మాజీ సర్పంచులు కంటం రాజ మల్లయ్య, మహేశుని ఈశ్వరయ్యతోపాటు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు, యజమానులు, ఆసాములు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడి సాయిబాబా మందిరం సప్తదశ వార్షికోత్సవం సందర్భంగా మహా అన్నదానం

**ఖమ్మం, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం బైపాస్ రోడ్డు విజయనగర్ కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరం (17) సప్తదశ వార్షికోత్సవం సందర్భంగా మందిరంలో కొలువై ఉన్న బాబా వారికి ప్రత్యేక హారతులు , మంగళ తోరణంలు మరియు అభిషేకములు నిర్వహించారు . మధ్యాహ్నం హారతి తర్వాత నారాయణ సేవ ( మహా అన్నదాన ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు . సుమారుగా 4000 మంది భక్తులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు . వచ్చిన భక్తులకు బాబా వారు ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు . ముఖ్య అతిథులుగా భాగం హేమంతరావు దంపతులు , పోట్ల వెంకటేశ్వరరావు దంపతులు , ఇంటూరి తులశమ్మ లు పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో ఆలయం ఛైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్య , వైస్ ఛైర్మన్ బుద్ధా రామకృష్ణ , సెక్రటరీ పెంట్యాల వెంకటనర్సయ్య , జాయింట్ సెక్రటరీ చంద్ర వీరభద్రరావు , కోశాధికారి కపులూరి అప్పారావు , సభ్యులు మండెపూడి కృష్ణయ్య , దొడ్డ నరసింహారావు , భూక్యా భిక్షపతి , స్థానిక కార్పొరేటర్ రోహిణి సత్యనారాయణ , మాజీ కార్పొరేటర్ మచ్చ నరేందర్ తదితరులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమాన్ని దివ్యంగా జరపడానికి సహకరించిన విజయనగర కాలనీ భక్త మహాశయులకు , సాయి భక్త మహాశయులకు మరియు సేవా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ కమిటీ వారు పేరుపేరునా కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు .



# పల్లెల్లో వెలుగని వీధి దీపాలు... అంధకారంలో పలు గ్రామాలు..

- పలుసార్లు అధికారులకు విన్నపాలు...
- నిధులు లేవంటూ అధికారుల సమాధానం...






**బయ్యారం, జూన్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంతో సహా మండలం లోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలలో, పలు కూడలలో వీధి దీపాలు గత నెల నుండి వెలగడం లేదని, వర్షాల కారణంగా గ్రామాలలో చెడు చెత్త ఎక్కువ గా పెరగటం, వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల పాములు,తేళ్లు వంటి విష కీటకాలు చీకటి సమయంలో చల్లదానానికి రహదారుల మధ్యకు రావడం వల్ల ఆ కూడలలో రాత్రి వేళల్లో ప్రజలు నడవాలంటే ప్రాణ సంకటంగా మారింది. వీధి దీపాలు లేక ,ఉన్నవి సరిగా వేలగక ప్రధాన కూడళ్లలో వచ్చే పోయే వాహనాల వల్ల యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు ఇంటి నుండి బయటకు వెళ్లాలంటే భయం భయంగా ఉందంటూ ఎన్నో మార్లు మండల అధికారుల దృష్టికి,గ్రామపంచాయతీ సెక్రటరీలకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. ఈ విషయమై ప్రజలు అధికారులను అడగగా గ్రామపంచాయతీ లకు నిధులు రావటం లేదని చెప్పి పంపించారంటూ తెలిపారు. ఇది ఇలా ఉండగా సోలార్ లైట్లు గ్రామాల్లో ఉన్నా కూడా అవి పనిచేయడం లేదని కనీసం వాటిని మరమ్మతు చేసినా కొంతమేర ఉపశమనం కలుగు తుందని తెలిపారు.

## ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి: ఎఇ సుమన్






**బయ్యారం, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు వినియోగదారుల సేవకై ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గం.ల వరకు విద్యుత్ సమస్యలు, వాటి పరిష్కారాలకి ఆపరేషన్ సెక్షన్ కొత్తపేటలో ప్రజావాణి డెస్క్ నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఏఇ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర,సులభతర సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని, వినియోగదారులు ఫిర్యాదును బట్టి అట్టి సమస్యలకు 15 రోజులలోపు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇందుకు గాను విద్యుత్ ప్రజావాణి 1912 నెంబర్ కు లేదా తన నంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదును చెప్పుకోవచ్చని లేదా నేరుగా రాతపూర్వకంగా ఇవ్వవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు రికార్డు అవుతుందని తెలిపారు.

# సిఎస్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పరకాల, జూన్16 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణం సీఎస్ఐ మిషన్ హై స్కూల్ పూర్వ విద్యార్థుల(1997- 98 ఎస్ఎస్సి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళ కార్యక్రమం ఎంతో సందడిగా జరిగింది. 26 సంవత్సరాల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని గురువుల సన్మానాలు, ఆటపాటలతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయుడు కేజే థామస్, ఉపాధ్యాయులు నరసింహరామయ్య, డీ.కోర్నేల్, ఎం జేమ్స్, పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు శనిగరపు నవీన్ ఒంటేరు మధు ,సొల్లేటి సునేందర్, పట్టిం శంకర్, ఆడప రాజేందర్, ఎంఎ ఇమ్రాన్, మడికొండ సునీల్, పాలకుర్తి తిరుపతి, పిట్ట సునీత, బి. శ్రీలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సత్య శారదదేవి



**వరంగల్ ప్రతినిధి, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదివారం వరంగల్ జిల్లా కలెక్టర్ గా డాక్టర్ సత్య శారదదేవి జిల్లా కలెక్టరేట్ లో బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భం గా జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డిపిఆర్ఓ అయ్యుబ్ అలీ, డి ఈ ఓ వాసంతి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఆర్డీవోలు సీతం దత్తు, కృష్ణవేణి, ఎల్ డి ఎం హవేలీ రాజు, కలెక్టరేట్ ఏవోలు శ్రీకాంత్, అబిద్ అలీ, తహసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, ఫణి కుమార్, విజయ్, రవిచంద్ర రెడ్డి, పర్యవేక్షకులు మంజుల, చంద్రశేఖర్, నాయబ్ తహసీల్దార్ లు, సిబ్బంది తదితరులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జిల్లా అధికారులతో శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు.త్వరలో శాఖల వారిగా సమీక్షలు నిర్వహిస్తానని , జిల్లా అధికారుల సమన్వయంతో అభివృద్ధి లో వరంగల్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని అన్నారు.

# వివేకానంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం



**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వన్ టౌన్ నందు ఉన్న శ్రీ స్వామి వివేకానంద సంస్థ వారి సహకారంతో, ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించబడింది. ప్రతి సంవత్సరం మూడు సార్లు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఉంటారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మంది పాల్గొన్నారు, కంటి ఆపరేషన్లకు 50 మంది ఎన్నికయ్యారు, వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్.సి .ఎం .ఎ . జహీర్ అహ్మద్ పేషెంట్లను తనిఖీ చేసి, ఉచితంగా మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్. కృష్ణ, చాందిని, శాంతి, సౌజన్య, లతా, క్యాంపు కోఆర్డినేటర్ వై . రాజు, సంస్థ అధ్యక్షులు అప్పారావు, సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# వికలాంగురాలికి వీల్ చైర్ ఇచ్చి మానవత్వం చాటుకున్న సత్యనారాయణ

- సోషల్ మీడియా రఘుకి వంశీకి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ ప్రజలు ..



**మరిపెడ, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలం గిరిపురం గ్రామపంచాయతీ నందు ఆ గ్రామంలో నివసిస్తున్న బెల్లి సంఘవికి 21 సంవత్సరాలు పుట్టుకతోటి రెండు కాళ్లు పడిపోవడం జరిగింది. సంఘవి పరిస్థితిని గమనించిన అదే గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ సోషల్ వారియర్ పట్ల వంశీ సోషల్ మాధ్యమాల ద్వారా కురవి మండల పంచాయతీకి చెందిన రఘుకు సంఘవి పరిస్థితిని వివరించాడు. రఘు వెంటనే డోర్నకల్ మండలం గొల్ల చర్ల గ్రామానికి చెందిన సత్యనారాయణకు వివరించగా తను మంచి హృదయంతో స్పందించి వీల్ చైర్ ని బహూకరించడం జరిగింది. ఆ వీల్ చైర్ ని సంఘవికి రఘు ,ప్రశాంత్ ,నవిన్ ,వంశీ అందరూ కలిసి అందించరు. సంఘవి మాట్లాడుతూ వీల్ చైర్ బహుమతిగా ఇచ్చిన సత్యనారాయణ అందించిన రఘు ప్రశాంత్ నవీన లకు కృతజ్ఞతలు తెలిపారు.

# అద్విత్‌నీ ఆశీర్వదించిన బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్

**చిట్యాల, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రం లోని బిజెపి పార్టీ బూత్ అధ్యక్షులు తూముల జగదీష్ కుమారుడి అద్విత్ యొక్క మొదటి పుట్టిన రోజు వేడుకకు బిజెపి చిట్యాల మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ హాజరై అద్విత్ ను ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాయకులు బీజేవైఎం మండల అధ్యక్షుడు మైదాన్ శ్రీకాంత్ కేంసారపు ప్రభాకర్ రాకం శ్రావణ్ పిట్టల సురేష్ తూముల రాజు తదితరులు పాల్గొన్నారు




# రామచంద్రయ్య దశ దిన కార్యక్రమానికి హాజరైన భద్రునాయక్



**ఖమ్మం, జూన్ 16 (పీసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ప్రముఖ వైద్యులు శీలం పాపారావు తండ్రి రామచంద్రయ్య దశదిన కార్యక్రమం ఆదివారం ఖమ్మంలో నిర్వహించగా లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణోతూ భ ద్రు నాయక్ హాజరై శ్రద్ధాంజలి ఘటించారు . ఖమ్మం జిల్లాలో ప్రముఖ సర్జనుగా శీలం పాపారావు తండ్రి రామచంద్రయ్య దశ దిన కార్యక్రమం కు బద్రునాయక్ తో పాటు వీరనారి నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి , గౌరవ అధ్యక్షురాలు షేక్ నజీమా , టీజేఎస్ నగర అధ్యక్షులు జంగి పల్లి రవి , ఎస్సీ,ఎస్టీ ,బీసీ,మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు , వీరనారి మణుల ఆశయ సాధన సమితి నాయకులు శ్రీనివాస్ నాయక్ , వీరన్న నాయక్ , బాలు , జ్యోతి , అబ్దుల్ రెహమాన్ , జయ , నాగేశ్వరరావు , స్పందన , ఝాన్సీ , సామాజిక ఉద్యమకారుడు పెద్ద పాక నాగభూషణం లు హాజరై శ్రద్ధాంజలి ఘటించారు .

# కౌశిక్‌నీ పాడే కట్టే దహన సంస్కార కార్యక్రమము దగ్గర్లోనే ఉన్నది



**కరీంనగర్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో రహ్మత్ హుస్సేన్ టీపిసిసి కార్యదర్శి మాట్లాడుతూ నీవు బ్లాక్మెయిల్ చేస్తూ రాజకీయ బ్రోకర్ గా వ్యవహరించట్టం ఒక బీసీ నాయకుని అభివృద్ధి నీకు ఒంట పట్టలేకనే పొన్నం ప్రభాకర్ పై నిరాధార ఆరోపణలు చేసి నీ పబ్బం గడుపుకునే కంటున్న పగటి కలలు ఎన్నటికీ ఈ జన్మలో కూడా సాకారం కావు ఇంకోసారి ఇలాంటివి చిల్లర బొల్లర ఆరోపణలు చేస్తే త్వరలో నే రాజకీయ జీవితానికి పాడే కట్టి బొంద పెట్టడం ఖాయం ఖబడ్దార్ కౌశిక్ స్థాయికి మించి బీసీ నాయకుడు పొన్నంప్రభాకర్ పై అవాకులు చెవాకులు పేలితే నిన్ను ఎక్కడ పడితే అక్కడే అడ్డుకోవటం, నీకు రాజకీయ భిక్ష పెట్టినకాంగ్రెస్కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదు అన్నారు.

# ఫాదర్స్ డే వేడుకలు

**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ స్వామి వివేకానంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద సంస్థ అనాధ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న తండ్రులను,సి హెచ్ . సూర్యనారాయణ, నాగేశ్వరరావు ను వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్.సి .ఎం .ఎ . జహీర్ అహ్మద్ సాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు కూడా మనకి జీవితాన్నిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలని, ఫాదర్స్ డే సందర్భంగా ఈ తండ్రులకు సన్మానం చేయడం, నా అదృష్టంగా భావిస్తున్నానని, ఎంతోమంది తల్లిదండ్రులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి భరోసాగా నిలబడ్డ సంస్థ వారిని, సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అప్పారావు , సంస్థ సభ్యులు అప్పలకొండ, సోంబాబు మరియు సంస్థ మహిళా సభ్యులు ఉమాదేవి, రాణి, రత్న, సుజాత , ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.



# వ్యవస్థలను మార్చే శక్తి జర్నలిస్టులకే సాధ్యం

● జర్నలిస్ట్లలకు అండగా ఐఎన్టియుసి ఫెడరేషన్

● జర్నలిస్ట్ల పిల్లలకు ఉచిత విద్య, వైద్య సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

● జర్నలిస్ట్లలపై అక్రమ కేసులు సిగ్గు చేటు

● ఐఎన్ టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.మురహరి బుద్ధారం

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని సుమన్ గౌడ్



**కురవి, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యవస్థను మార్చే శక్తి కేవలం జర్నలిస్టల కలనికే సాధ్యమని ఐఎన్ టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్ధారం పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కరించకపోగా అక్రమ కేసులు పెట్టిందని ఐఎన్ టియుసి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని సుమన్ గౌడ్ అన్నారు. కార్మికుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం కురవి మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర మినీ పంక్షన్ హాల్లో టియుడబ్ల్యూజె (ఐజేయు) మండల ప్రధాన కార్యదర్శి ప్రమోద్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఐఎన్ టియుసి రాష్ట్ర అధ్యక్షులు డా. మురహరి బుద్దారం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని సుమన్ గౌడ్ లకు టియుడబ్ల్యూజె (ఐజేయు) జిల్లా అధ్యక్షులు సి హెచ్ శ్రీనివాస్ లు ఘన స్వాగతం పలికారు. శాలవాలతో సన్మానం చేసి మెమరండం అందజేసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కురవి శ్రీ వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి సమావేశంలో వారు మాట్లాడుతూ జర్నలిస్ట్ రాసే ప్రతి అక్షరం లక్షల మంది మెదళ్ళను కదిలిస్తుందని, నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేసే జర్నలిస్ట్ లకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. జర్నలిస్ట్ ల కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యంతో పాటు ఇంటిస్థలం, గృహాలు కల్పించలేదని ఆరోపించారు. ఐఎన్ టి యుసి ఫెడరేషన్ జర్నలిస్ట్ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ ల పిల్లలకు ఉచిత విద్య అందించడం కోసం, అలాగే వైద్యం అందే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, ప్రతి జర్నలిస్ట్ లకు ప్రభుత్వం అందించే అక్రిడీటేషన్ అందేవిధంగా కృషి చేసి, స్థలంతో పాటు ఇందిరమ్మ గృహాలు మంజూరి కోసం తమ సయశక్తులా ఐఎన్ టియుసి ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు. అన్నిరంగాల్లోని కార్మికులు ఐఎన్ టి యు సి సంఘం బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. అందుకు సంఘం అండగా ఉంటుందన్నారు. జర్నలిస్ట్ లపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే ఊరకునేదిలేదని కచ్చితంగా జర్నలిస్ట్ పక్షాన నిలబడుతుందని అన్నారు. సమస్యలు వస్తే సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఐఎన్ టి యుసి నూతన కమిటీలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేశామన్నారు. త్వరలో అన్ని జిల్లా, మండలాల్లో నూతన కమిటీలు నియమిస్తామని అందుకు కార్మికులు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టియుసి ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, లాయర్ భాస్కర్, టియుడబ్ల్యూజె (ఐజేయు) దాడుల నియంత్రణ కమిటీ జిల్లా కో కన్వీనర్ బేతమల్ల సహాదేవ్, సీరోలు ప్రధాన కార్యదర్శి మడ్డి వీరన్న గౌడ్, కురవి ఉపాధ్యక్షులు గండమాల రోషయ్య, ఆమెడ నాగరాజు, నాయకులు కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి కృషి చేస్తా ...

● ననావత్ భూపాల్ నాయక్

**మహబూబాబాద్, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే లక్ష్య సాధనకు ప్రభుత్వం సహాయ, సహకారం అవసరం ఉందని ప్రముఖ పారిశ్రామిక, వ్యాపార, రాజకీయవేత్త, కిసాన్ పరివార్ అధినేత ననావత్ భూపాల్ నాయక్ అన్నారు. హైదరాబాద్ లోని సచివాలయంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. రామ చంద్రు నాయక్ తో కలిసి తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క, రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ అనిత రామ చంద్రన్ తో సంప్రదింపులు జరిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి ఉత్పత్తి అయ్యే ముడి సరుకు ఆదారితంగా పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఐటీ, విదేశీ ఎగుమతులు చేపట్టి మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎందరో యువకులు, విద్యావంతులు అయిన నిరుద్యోగులకు వేల మందికి ఉపాధి అవకాశం ఇచ్చే ప్రణాళికను సీతక్కకు అందించారు. డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. రామచంద్రు నాయక్ సహకారంతో తొలి విడతగా డోర్నకల్ నియోజకవర్గాన్ని మోడల్ గా తీర్చి దిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు భూపాల్ నాయక్ చెప్పారు. 2024 నుండి ఈ దిశగా ప్రయత్నం మొదలు పెట్టి 2025 నుండి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ నుండి తన రాజకీయ భవిష్యత్ కోసం ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రయత్నం చేసిన ఆయన భవిష్యత్ భరోసా పేరుతో ప్రజల ముందు ఉంచిన వాగ్దానాన్ని నెరవేర్చే పనిలో ఉన్నారు. రాజకీయ, వర్గ విభేదాలకు తావు లేకుండా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. రామ చంద్రు నాయక్ లతో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మిగత అందరు ఎమ్మెల్యేల సహాయ, సహకారంతో పెద్ద ఎత్తున ప్రణాళికలు వేస్తున్నట్లు భూపాల్ నాయక్ తెలిపారు. ఇప్పటికే వివిధ వ్యాపార, వాణిజ్య, విదేశీ ఎగుమతి రంగాల్లో ఉన్న తనకు ఇది పెద్ద కష్టం కాదని, తెలంగాణ రాష్ట్రంలో మహబూబాబాద్ పార్లమెంట్ ను రోల్ మోడల్ గా చేసేందుకు తను సిద్ధంగా ఉన్నానని, ప్రభుత్వం తన లక్ష్యానికి సహాయ, సహకారం అందిస్తే ఆయా పనులు 5 సంవత్సరాల్లో పూర్తి చేస్తానని ఆయన మంత్రి సీతక్కకు వివరించారు. పార్లమెంట్ పరిధిలో తన ప్రాజెక్ట్ పనులు, నివేదికలు, ప్రాతిపదిక స్థలాలు, పరిశ్రమల గుర్తింపు పనుల కోసం సిబ్బంది పనులు చేస్తున్నారని భూపాల్ నాయక్ వివరించారు. ఏది ఏమైనా మహబూబాబాద్ పార్లమెంట్ కు ఈ భూపాల్ నాయక్ రాజకీయాలకు అతీతంగా చేస్తున్న కృషిని ప్రజలు స్వాగతిస్తున్నారు.



# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్‌గా జితేష్ వి. పాటిల్ పదవీ బాధ్యతలు



**కొత్తగూడెం, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదివారం జిల్లా కలెక్టర్ గా ఉదయం 10 :15 నిమిషాలకు ఐ డి ఓ సి లో తన ఛాంబర్ లో తొలి సంతకం చేసి నూతన కలెక్టర్ గా పదవీ బాధ్యతలను జితేష్ వి. పాటిల్ స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మరియు అన్ని శాఖల జిల్లా అధికారులు పుష్పగుచ్ఛం అందించి కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలెక్టర్ గా పని చేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అందరినీ సమన్వయం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాల నెపంతో దాడులు సరియైనవి కావు



**జనగామ, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆధునిక యుగంలో అనాగరికమైన ఆటవిక చర్యలను ఖండించాల్సినటువంటి ఈ సందర్భంలో మనుషులు మానవ మృగాలు లాగా మారి సాటి మనుషులను హింసించి దాడులు దౌర్జన్యాల పేరుతో చంపాలని చోటు సరియైనది కాదని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కమిటీ నిజనిర్ధారణ కమిటీ వెల్లడించింది. ఆదివారం నర్మట మండల కేంద్రంలో గత బుధవారం నక్కల సత్తెమ్మ అనే వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన నక్కల రవి అనే వ్యక్తి తన కుటుంబంలోని భార్యాపిల్లలకు అనారోగ్యం చేస్తుండటంతో నక్కల సత్తెమ్మపై అనుమానం పెంచుకొని ఆ రోజు రాత్రి గ్రామంలో యక్షగాన కళాకారుల కథ దగ్గరికి పోయి వస్తున్న సత్యమ్మ మీద రాత్రి సుమారు పదిన్నర గంటల ప్రాంతంలో గ్రామ బొడ్రాయి వద్ద చాలా ఉన్మాదంగా ప్రేరేపితుడైన నక్కల రవి గొడ్డలితో వృద్ధ మహిళ అని చూడకుండా అత్యంత దారుణంగా తలపైన నరకడం సభ్య సమాజం తలదించుకునే చర్యగా భారత నాస్తిక సమాజం అభివర్ణిస్తుంది .ఈరోజు నర్మట గ్రామంలో స్థానిక పోలీస్ స్టేషన్ లోని ఎస్ఐ శ్రీకాంత్ మరియు బాధిత మహిళా ఇంటికి వెళ్లి చుట్టుపక్కల ఇండ్ల వారిని పరిశీలించి నిజనిర్ధారణ జరపడం జరిగింది. ఆ గ్రామంలో అనేకమంది ఆ కుటుంబం పట్ల ఒక రకమైన అణచివేతకు వెలువేతకు గురి చేస్తున్నట్టుగా వాళ్ళు మానసిక సంఘర్షణకు లోనవుతున్న ఈ సందర్భంలో సామాజిక సాంఘిక అభ్యుదయ సంఘాలు నాయకులు ఆ కుటుంబానికి బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని భారత నాస్తిక సమాజం విజ్ఞప్తి చేస్తున్నది .నిజనిర్ధారణ కమిటీ పాల్గొన్నవారు భార త నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య. వీసీ కే పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుపల్లి ఆనంద్. బా నా స రాష్ట్ర నాయకులు తుంగ రాములు .తూడి ప్రసాద్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నవీన్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ నియంతృత్వ విధానాలను వ్యతిరేకించండి

● రచయిత అరుంధతి రాయ్, విద్యావేత్త షేక్ సాగత్ హుస్సేన్ మీద పెట్టిన ఉపా కేసులను రద్దు చేయాలి

● సిపిఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ నేత ఆవునూరి మధు



**కొత్తగూడెం, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత రాజ్యాంగాన్ని వాటి హక్కులను కాల రాస్తున్న బిజెపి ప్రభుత్వ నిరంకుశ విధానాలను ఖండిస్తూ ప్రశ్నించే గొంతుకులను అణిచివేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలను మరోసారి రుజువు చేసుకుందనీ అందులో భాగంగానే 14 ఏళ్ల నాటి ఊపా కేసులో ఇప్పుడు అరుంధతి రాయ్, షేక్ సాకత్ హుస్సేన్ పై పెట్టిన ఉపా కేసును రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అన్నారు. ఉపా కింద ప్రముఖ రచయిత అరుంధతి రాయి, ప్రముఖ విద్యావేత్త షేక్ సాకత్ హుస్సేన్ ను ప్రాసిక్యూట్ చేయడానికి ఢిల్లీ లెఫ్ట్నెంట్ గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. 14 సంవత్సరాల క్రితం నాటి కేసులో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఇలా అనుమతి మంజూరు చేయడం దురుద్దేశంతో కూడిన చర్య అని విమర్శించింది. ఐపీసీ లోని 120 బి,153ఏ, 153బి,504,505,13,ఉపా వంటి తీవ్రమైన సెక్షన్ కింద ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతినివ్వడం ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతెత్తే వారిని అణిచివేయాలని బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం భావిస్తుంది అని స్పష్టమవుతుంది. ప్రాసిక్యూషన్కు అనుమతిని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఐ (ఏం. ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుంది. ఖండిస్తుంది. ఇది బావ ప్రకటన స్వేచ్ఛకు వ్యతిరేకంగా తీసుకున్న ప్రతికార చర్యగా దీన్ని ప్రజలు గుర్తించాలని పార్టీ కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ చర్యకు వ్యతిరేకంగా ప్రజలు ప్రజాస్వామిక వాదులందరూ పెద్ద ఎత్తున కదిలి ఉద్యమించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటి విజ్ఞప్తి చేస్తున్నదని పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

# విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం

● ఏడిఈ లోక్ నాధ్ రెడ్డి

**మరిపెడ, జూన్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు,తొర్రుర్ డి ఈ పర్యేక్షణలో నేటి నుంచి ప్రతి సోమవారం విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మరిపెడ సబ్ డివిజన్ ఏడిఈ లోక్ నాద్ రెడ్డి తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మరిపెడ సబ్ డివిజన్ కార్యాలయం తో పాటు, ఎల్లంపేట,చిన్నగూడూరు ,నర్సింహుల పేట విద్యుత్ సెక్షన్ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తారని కావున విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ ఆధ్వర్యంలో బ్లీచింగ్ పౌడర్ పంపకం



**కరీంనగర్ టౌన్, జూన్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** జనాబ్ మహమ్మద్ అబ్బాస్ సమీ సాహబ్, మాజీ డిప్యూటీ మేయర్ పర్యవేక్షణలో, బల్దియా (మునిసిపల్) 27 వ డివిజన్, హుస్సానిపుర నుండి బ్లీచింగ్ పౌడర్ను ఈ రోజు ఆదివారం పంపకం చేయడం నేషనల్ ప్యాలెస్‌లో జరిగిందీ. బాబా మామా, రియాజ్ భాయ్, మజార్ బాబా, నిసార్ భాయ్, షాహిద్, జాకీర్ కూడా ఉన్నారు.

# సంఘం శరణం గచ్ఛామి

● అంబేద్కర్ జీవితం, ఆశయం, లక్ష్యం

నాటకాన్ని తిలకించిన నాయకులు, ప్రజలు

**మేడ్చల్ -మల్కాజ్గిరి,జూన్ 16, (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ రోడ్ ప్లవర్ ఫంక్షన్ హాల్ యందు తేది జూన్ 16 ఆదివారం సాయంత్రం 6 గంటలకు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే సంఘం శరణం గచ్చామి కళారూపన్ని తిలకించిన వారు ధన్యులు అని పూలే అంబేద్కర్ లక్ష్యసాధన కమిటీ వారు భావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నాటకంలో నవభారత నిర్మాత ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం ఆశయం లక్ష్యాల పై కళారూపంలో అంబేద్కర్ చిన్న తనం నుండి అడుగు అడుగునా వెలివేత అంబేద్కర్ కుటుంబ త్యాగమే భారత రాజ్యాంగం దాని ఫలితాలు. ఈ నాటకాన్ని తిలకించి మీరు అంబేద్కర్ గురించి ఏమి తెలుసాకున్నారు. మీ వాడల్లో మీ కాలనీళ్ళో రేపటి తరానికి చదువు యొక్క దైర్యం గొప్పతనం గురించి చెప్పండి . ఈ కార్యక్రమం నిర్వహణ పూలే అంబేద్కర్ లక్ష సాధన కమిటీ నేతలు... అధ్యక్షులు బెంగళూరు ప్రసాద్, సలహాదారులు కర్రె మల్లేశం, గద్దల దుర్గయ్య, బోడ నరేష్ ,అధ్యక్షులు గంధమల్ల నరసింహ, ఉపాధ్యక్షులు పాడుగుల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సిరిపంగి యాదగిరి, కోశాధికారి మామిళ్ల విష్ణుమూర్తి, సహాయ కార్యదర్శి నూకల దశరథ, కమిటీ సభ్యులు గిరీష్ , ఈద భాస్కర్, పాడుగుల రూప, బల్ల ఈశ్వరి, బల్ల శ్రీనివాసరావు తదితరలు ఉన్నారు.

